
కొడంగల్ పరిధిలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గౌతమ్

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష
- కొడంగల్‌లో ఇంటి నిర్మాణాల పరిశీలన

వికారాబాద్/కొడంగల్, మే 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా జాబితాను రూపొందించాలని గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ధ్రువీకరణ ప్రక్రియపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవో, ధ్రువీకరణ గెజిటెడ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా వచ్చిన జాబితాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఆయా కుటుంబాల స్థితిగతులను పరిశీలించి పారదర్శకంగా జాబితాలను రూపొందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎ్‌సహెచ్‌వో సత్తార్, హౌసింగ్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలి

కొడంగల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మంగళవారం గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అంతకు ముందు కొడంగల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు నిరుపేదలకే ఇళ్లు కేటాయించాలన్నారు. హుసేన్‌పూర్, దుద్యాల, సంగాయిపల్లి గ్రామాల్లో మొదటి విడతలో మంజూరైన ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అధికారులు కృష్ణయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, డిప్యూటీ ఈఈ చందర్ నాయక్, ఎంపీడీవోలు ఉషశ్రీ, మహేశ్ పాల్గొన్నారు.

రెండు నెలలు గడువిచ్చినా అదే దుస్థితి
జిల్లాలో మొత్తం దరఖాస్తులు 36,995
ఫీజు చెల్లించింది కేవలం 6,207 దరఖాస్తులకే
రాయితీని 21.25 శాతమే సద్వినియోగం
ఫీజు చెల్లింపులతో రూ.19.80 కోట్ల ఆదాయం



అనుమతి లేని లే అవుట్లలో కొనుగోలు చేసిన స్థలాలు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేందుకు ఇచ్చిన అవకాశాన్ని కొందరు మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన మొత్తం 36,995 దరఖాస్తుల్లో కేవలం 6,207 దరఖాస్తులకు సంబంధించిన ఫీజు మాత్రమే చెల్లించారు. ఫీజు లెటర్లు జారీ చేసిన వారిలో 21.25 శాతమే సద్వినియోగం చేసుకున్నారు. ఈ చెల్లింపులతో ప్రభుత్వ ఖజానాకు రూ.19.80 కోట్ల ఆదాయం సమకూరింది.

స్పందన

అంతంతే!



నామమాత్రంగా ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ

వికారాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీతో చెల్లించడానికి మొదట మార్చి 31వ తేదీ వరకు గడువు విధించగా, దరఖాస్తుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఏప్రిల్ 30 వరకు మరోసారి ప్రభుత్వం గడువు పొడిగించింది. మే 3వ తేదీ వరకు రాయితీతో చెల్లించడానికి గడువు విధించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తుదారుల నుంచి స్పందన కరువైంది. అనుమతి లేని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి అవగాహన కల్పించేందుకు మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ప్రచారం నిర్వహించారు. ప్రారంభం నుంచి ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు, లోపాల కారణంగా దరఖాస్తుదారులకు పలు ఇబ్బందులు ఎదురైన విషయం తెలిసిందే. మే 3వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు 25 శాతం రాయితీతో చెల్లించేందుకు ప్రభుత్వం విధించిన గడువును దరఖాస్తుదారులు ఆశించిన స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయారు. ప్రత్యేక సహాయ కేంద్రాలు

మిగతా 8వ పేజీలో...

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఫీజు చెల్లించినవారు	వసూలైన ఫీజు (రూ.కోట్లలో)	ప్రొసీడింగ్‌లు జారీ
కొడంగల్	406	123	0.44	70
వికారాబాద్	4,026	1,000	3.51	658
పరిగి	4,209	910	2.34	500
తాండూరు	12,259	1,387	3.93	186
పంచాయతీలు	16,095	2,787	9.58	285
మొత్తం	36,995	6,207	19.8	1,699

అదనంగా రూ.5.75 కోట్లు వసూలు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 20,900 దరఖాస్తులు రాగా, వాటిలో 15,847 దరఖాస్తులకు సంబంధించి ఫీజు లెటర్లు స్వీకరించారు. కాగా, వీటిలో 3,420 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా, సంబంధిత అధికారులు 1,414 దరఖాస్తులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీతో మున్సిపాలిటీల నుంచి రూ.10.22 కోట్లు వసూలు కాగా, గ్రామ పంచాయతీల నుంచి రూ.9.58 కోట్లు వసూలయ్యాయి. కాగా, ఇందులో మార్చి నెలాఖరు వరకు రూ.14.05 కోట్లు వసూలు కాగా, మే 3వ తేదీ వరకు ప్రభుత్వం కల్పించిన అవకాశంతో రూ.5.75 కోట్లు అదనంగా వసూలయ్యాయి.

సమాచారం

నేడు వికారాబాద్‌కు డిప్యూటీ సీఎం



వికారాబాద్, మే6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేడు(బుధవారం) వికారాబాద్‌కు రానున్నారు. ఎన్నెపల్లి చౌరస్తాలో ఉదయం 11 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం అక్కడ నిర్వహించే సభలో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం స్థానిక సత్య భారతి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ జిల్లా సమావేశంలో అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో నిర్వహించనున్నారు.

డీఎడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు డీఎడ్ కళాశాలలో 2025-27 రెండు సంవత్సరాల కోర్సు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాలలో చేరడానికి జూన్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ రామాచారి తెలిపారు. ఎంట్రన్స్ జూన్ 25న కంప్యూటర్ బేస్డ్ ద్వారా నిర్వహిస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే వారు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ, బీసీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఎస్సీ ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులతో పాసై ఉండాలి. అభ్యర్థులు జూలై 1 నాటికి 17 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హార్డ్‌కాపీలను అందించాలి

బీసీ సంక్షేమాధికారి ఉపేందర్



వికారాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): 'రాజీవ్ యువ వికాసం' కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో హార్డ్ కాపీలను అందజేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఉపేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలి

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మే 6(ఆంధ్రజ్యోతి): యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంక్షేమశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలనలో అర్హత ఉన్న దరఖాస్తులను బ్యాంకర్స్ లాగిన్‌లోకి పంపాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయని అవసరమైన సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులకు ఫోన్ చేసి తెప్పించుకోవాలన్నారు. ఇందులో మొదటి, రెండో కేటగిరీలకు సిబిల్ స్కోర్ అవసరం లేదని, 3,4 కేటగిరిలలోని దరఖాస్తులకు మాత్రం తప్పనిసరిగా సిబిల్ స్కోర్ పరిశీలించారు.

వెనువెంటనే జాబితా పంపాలి

ఒక మున్సిపాల్టీవి వేరొక మున్సిపాల్టిలోకి అదే విధంగా ఒక వర్గానికి సంబంధించినవి వేరొక వర్గంలోకి దరఖాస్తులు వచ్చి ఉంటే వాటిని వెంటనే సంబంధిత మున్సిపాల్టికి, సంబంధిత వర్గాలకు ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. ఎంపికైన దరఖాస్తుల సెలక్షన్ లిస్టులను వెంట వెంటనే పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంత వరకు పూర్తయితే ఏ రోజుకా రోజు జాబితాను ఆన్‌లైన్‌లో పంపాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, డీఆర్‌వో సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, హౌజింగ్ ఈడీ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎండీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్


దత్తత తీసుకున్న బాలుడిని అప్పగిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు, చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్ కంట్రీ (ఇటలీ) తల్లిదండ్రులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వికారాబాద్ శిశుగృహలో పెరుగుతున్న ఎనిమిదేళ్ల అబ్బాయిని ఇటలీకి చెందిన దంపతులకు దత్తత ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా పిల్లలను దత్తత తీసుకుంటే చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే శిశు గృహ వికారాబాద్‌ను సంప్రదించాలన్నారు. దత్తత స్వీకరణలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారిని జయసుధ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వెంకటేశం, బీఆర్పీ కో ఆర్డినేటర్ కాంతారావు, డీసీపీఓ శ్రీకాంత్ శిశు గృహ మేనేజర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


మీర్‌పేటలోని క్యాంప్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

సబితకు భారీ ఉపశమనం

- ఓబుళాపురం కేసులో నిర్దోషిగా కోర్టు తీర్పు
- దశాబ్దంన్నరగా రాజకీయ ఒడిదుడుకులు
- అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి భారీ ఉపశమనం లభించింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ఆమెకు మంగళవారం సీబీఐ కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. దాదాపు 15 ఏళ్లకుపైగా నడిచిన ఈ కేసులో సబితారెడ్డిపై 12 ఏళ్ల కిందట అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసులో ఏ-9గా ఉన్న ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఆమె వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కేసు సబితారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. గనులశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓబుళాపురంలో గాలి జనార్దన్‌రెడ్డి, ఇతరులకు ప్రయోజనాలు కల్పించారంటూ వచ్చిన అభియోగాలపై సీబీఐ విచారణ జరపడం, న్యాయస్థానం విచారణ చేపట్టడం చకచకా జరిగాయి.

ఆ సమయంలో పదవికి రాజీనామా..

ఆమె హోంమంత్రిగా ఉన్న సమయంలో కేసు నమోదుకావడంతో తనపదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఓబుళాపురం మైనింగ్ అక్రమాలపై 2009 డిసెంబర్‌లో

మిగతా 7వ పేజీలో...

ఆడపిల్లలను చదువుకోనివ్వండి

తాండూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దని వారిని చదువుకోనివ్వాలని తాండూరు మహిళా శిశు సంక్షేమ శాఖ ఏసీడీపీవో శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు ప్రాజెక్టు పరిధిలో నెల రోజుల వ్యవధిలో బాల్య వివాహాలు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. ఆడ పిల్లలకు 18ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయొద్దన్నారు. అలా ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల 9 బాల్య వివాహాలను అడ్డుకొని, రెండింటి విషయంలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బలవంతంగా బాల్య వివాహాలు చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1098 లేదా 181కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

వరి కోతల్లో జాగ్రత్తలు తప్పనిసరి

సరైన పద్ధతులు పాటిస్తేనే ధాన్యం సురక్షితం

మేడ్చల్ జిల్లాలో ఊపందుకున్న కోతలు

7


నీటిలో నుంచి ధాన్యాన్ని బయటకు తీసి చూపుతున్న రైతులు

అకాలవర్షం.. ఆగమాగం

సోమవారం రాత్రి భారీ వర్షం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వరద తాకిడికి కొట్టుకుపోయిన బస్తాలు
- లారీలు లేక తూకం వేసినా కేంద్రంలోనే వడ్లు
- ఎదులాబాద్, మాధారం కేంద్రాల్లో హమాలీల కొరత!
- ఆందోళనలో రైతులు


కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

ఘట్‌కేసర్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే తీర పంట చేతికొచ్చే సమయంలో వరుణుడి ప్రతాపానికి ధాన్యం తడిసిముద్దయింది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యమంత కొట్టుకుపోయి పక్కనే ఉన్న కాలువల్లో పడింది. తూకమేసిన బస్తాలు సైతం తడిసిపోయాయి. ఈదురుగాలులు, వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తూకం వేసిన

మిగతా 8వ పేజీలో...

వర్షాలతో తప్పని తిప్పలు



మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ధాన్యం తరలించడానికి లారీలు పంపించడం లేదు. రోజు కురుస్తున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మిల్లర్లు కిలోన్నర ధాన్యం కట్ చేస్తామని బెదిరిస్తున్నారు. ఈసారి కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది.

-ఆంజనేయులు, రైతు, ఎదులాబాద్

బషీరాబాద్ సీహెచ్‌సీ నిర్మాణానికి అడుగులు

- రోగులకు అందనున్న మెరుగైన వైద్యం
- సిబ్బందికి, ప్రజలకు తొలగనున్న ఇక్కట్లు



సీహెచ్‌సీ భవన నిర్మాణానికి తీసిన పునాదులు

బషీరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల కేంద్రంలో సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) నూతన భవన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ ఆసుపత్రి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. ఏడాది కిందట ఇక్కడి 10పడకల పీహెచ్‌సీని 30పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించి, ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా ఎమ్మెల్యే కృషి చేశారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులతో పాటు ఎంపీహెచ్‌ఏ, ల్యాబ్ టెక్నీషియన్ తదితర పోస్టుల నియామకానికి సైతం ఎమ్మెల్యే చొరవ తీసుకుని భర్తీ చేయించారు. కాగా ఈ ఆసుపత్రి నూతన భవనం నిర్మాణం పూర్తయితే మండల ప్రజలకు వైద్యసేవలు మెరుగుపడనున్నాయి. 24గంటల అత్యవసర సేవలతో పాటు పలు రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, ప్రసూతి వైద్యంతో పాటు కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు, ల్యాబొరేటరీ, స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ, రక్త, మూత్ర ల్యాబ్‌లు, పోస్టుమార్టం వంటి సౌకర్యాలు రోగులకు చేరువకానున్నాయి. ఓపీ సేవలతో పాటు గర్భిణుల సేవలు పెరుగుతాయి. ప్రస్తుత పీహెచ్‌సీ భవనంలోనే సీహెచ్‌సీ ఆసుపత్రి అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. దీంతో వైద్యులు, సిబ్బంది, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉద్యోగ, ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట



ఎంపీ రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, కేశవులు, శంకర్

ఆమనగల్లు, మే6(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం రవి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మైసిగండి వద్ద పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీకి అందజేశారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లకు విస్తరించేలా కేంద్ర ప్రభుత్వంపై మాట్లాడాలని కోరారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ తీవ్రమై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. మైసిగండిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయించాలని, కడ్తాలలో 30పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై ఎంపీ సానుకూలంగా స్పందించి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఆయా సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఉపాధి హామీలో కూలీల పనిదినాలు పెంచి పట్టణ ప్రాంతాలకూ వర్తింపచేసేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని గ్రామాల నాయకులు, శ్రీనివాస్‌గౌడ్ ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, బన్సీ, తులసీరామ్‌నాయక్, చందునాయక్, రామునాయక్, మహిపాల్ రెడ్డి, అల్వాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యం



గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నూతన కమిటీ సభ్యులు

శామీర్‌పేట, మే 6(ఆంధ్రజ్యోతి): దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీతో రెండో విడత గొర్రెలు, మేకలను పంపిణీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని జిల్లా మేకల, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మేకల కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం శామీర్‌పేటలో మల్లన్నగుడి వద్ద మేడ్చల్ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) మొదటి మహాసభను కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 2లక్షల నగదు బదిలీతో గొర్రెల పథకాన్ని అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు.ప్రభుత్వమొచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేన్నారు. పశువైద్యశాలల్లో మేకలకు, గొర్రెలకు మందులు లేవని, రెండేళ్ల నట్టల నివారణ మందులనూ ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ మంత్రే లేడని, సమస్యలను ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య, సంఘం వివిధ మండలాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మండల పెంపకందారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా శామీర్‌పేట మండల గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పినిగంటి కుమార్, ప్రధాన కార్యదర్శి మోతె వేణు, గౌరవాధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, రాములు, సహాయ కార్యదర్శులుగా స్వామి, గణేశ్, 21మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం



నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చౌదరిగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండలం శ్రీ రంగాపూర్‌లో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ సాదిక్, అశోక్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరం అని కలెక్టర్ అన్నారు. రూ.6.5లక్షలతో 10వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, జహంగిర్, మల్లేష్‌గౌడ్, రాములుగౌడ్, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, రవిగౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



యాలాలలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

యాలాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మంగళవారం గ్రామస్తులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కన్న కోరారు. యాలల దళితవాడ, బీసీ వాడ, మైనార్టీ కాలనీలో వారం రోజులుగా నీరందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని వారు చేశారు.

రాష్ట్రంలో సైనిక పాఠశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పీసీసీ నాయకుడు గౌరీ సతీష్

మొయినాబాద్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): యువత సాయుధ దళాల్లో చేరేందుకు ఉపయోగపడే సైనిక పాఠశాలను తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో అయన మాట్లాడుతూ.. రక్షణ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 33సైనిక్ పాఠశాలలున్నాయని, తెలంగాణలో మాత్రం ఒక్కటి కూడా లేదని అవేదన వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణ నుంచి సాయుధ దళాల్లో చేరేందుకు ఆసక్తి చూపే విద్యార్థుల కల కలగానే మిగిలిపోతోందని అన్నారు. అయితే తెలంగాణకు తొమ్మిదేళ్లక్రితం సైనిక పాఠశాల మంజూరైందని, 2017లో సైనిక్ స్కూల్ సొసైటీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం సైతం కుదుర్చుకుందని గుర్తుచేశారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో 50ఎకరాలు సేకరించినా అడుగు ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలోని కోరుకొండ, కలికిరి సైనిక పాఠశాలల్లో అడ్మిషన్లకు రక్షణశాఖ నిబంధనలను ఇటీవల మార్చడంతో రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఏప్రిల్ 5 పరీక్ష రాసిన తెలంగాణ విద్యార్థులు మరో నాలుగు రోజుల్లో ఫలితాలు వెల్లడికానున్న తరుణంలో మార్చిన నిబంధనలతో మన విద్యార్థులు స్థానికేతరులంటూ ప్రకటన చేయడం సరికాదన్నారు.



యాచారంలో వాహనదారులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

యాచారం, మే 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ తప్పక ధరించాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వాహనదారులకు సూచించారు. మంగళవారం యాచారంలో వాహనాలు తనిఖీని ఆమె పర్యవేక్షించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఆమె వెంట సీఐ నందీశ్వర్‌రెడ్డి ఉన్నారు.



భోజనం వడ్డిస్తున్న నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

రైతు శ్రేయస్సుకే ప్రభుత్వ నిర్ణయాలు

ఆమనగల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో రైతుల కోసం చైర్‌పర్సన్ యాట గీత సొంత డబ్బు వెచ్చించి ఏర్పాటు చేసిన భోజన కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, బీచ్యానాయక్‌లతో కలిసి రైతులకు భోజనాన్ని వడ్డించారు. చైర్‌పర్సన్ గీతను పలువురు అభినందించారు. ఏఎంసీ డైరెక్టర్ రవీందర్, కాంగ్రెస్ నాయకులు వస్పుల శ్రీకాంత్, హీరా సింగ్, ఫరీద్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి, నాయకులు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

షాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. ఏట్ల ఎర్రవల్లి వద్ద వాగుపై రూ.2కోట్లతో నిర్మించే బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పనులను ముమ్మరంగా చేపట్టి వానాకాలంలోగా పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శ్రీరాంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిష్టయ్య, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి

అర్హులందరికీ రుణాలివ్వండి

కేశంపేట, మే 6(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం స్కీంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రుణాలు ఇవ్వాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి బ్యాంకుల మేనేజర్లను కోరారు. మంగళవారం మండల పరిషత్‌లో ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ అధికారులతో కేశంపేట, నిర్దవెల్లి, వేముల్‌నర్వ కెనరాబ్యాంకు, కొత్తపేట గ్రామీణ వికాస్ బ్యాంకు, కేశంపేట ఎస్బీఐ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో యువ వికాసం పథకానికి 1,673 దరఖాస్తులొచ్చాయని, వీరిలో అర్హలందరికీ రుణాలు ఇవ్వాలని ఎంపీడీవో కోరారు. దరఖాస్తుదారుల జాబితాను బ్యాంకు మేనేజర్లకు అందించారు. ఎంపీవో కిష్టయ్య పాల్గొన్నారు.

బీజేపీ మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ మొయినాబాద్ రూరల్ అధ్యక్షుడిగా దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. కేతిరెడ్డిపల్లికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటి వరకు బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ పెద్దలు రూరల్ మండల అధ్యక్షుడిగా నియమించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



దర్గాకు పూజలు చేస్తున్న రవీందర్

భక్తిశ్రద్ధలతో దర్గా ఉర్సు

షాద్‌నగర్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డలో గల మక్తాలో మంగళవారం దర్గా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కేశంపేట మాజీ ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్ ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాలు హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, చందూ, వీరేశంగుప్తా, రవిగౌడ్ పాల్గొన్నారు.

10 నుంచి లక్ష్మీనృసింహుడి జయంతి ఉత్సవాలు



● ముస్తాబవుతున్న ఆలయం

ఇబ్రహీంపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న లక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణోత్సవానికి ఇబ్రహీంపట్నం ఆలయం ముస్తాబైంది. దేవాదాయ శాఖ, భక్తులు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంతో పాటు పరిసర గ్రామాలు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. వసతి, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. 10న శనివారం స్వామివారి సుప్రభాత సేవ, మంగళా శాసనం, 11న లక్ష్మీనృసింహా మహాయాగం, సహస్రనామ పారాయణం, రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరుపనున్నారు. 12న సోమవారం మహాలక్ష్మీ యాగం, చక్రస్నానం, నివేదన, రమాసత్యన్నారాయణస్వామి వ్రతం, సాయంత్రం రథోత్సవం, ఊరేగింపు, ఆలయ ప్రవేశం, పవళింపు సేవ ఉంటాయని నిర్వాహకులు వివరించారు.



ఇబ్రహీంపట్నం సమీపంలో కొండపై ఉన్న ఆలయం

కోర్కెలు తీర్చే దేవుడని భక్తుల విశ్వాసం



ఇక్కడ వెలిసిన లక్ష్మీనృసింహుడు భక్తుల కోర్కెలు తీరుస్తాడనేది భక్తులకు నమ్మకం. ఒకప్పుడు ఆలయానికి వెళ్లాలంటే దారి కూడా ఉండేది కాదు. ఇప్పుడు నలువైపుల నుంచి మంచి రోడ్లు వేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నందున అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆలయంతో ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు వచ్చింది.

- తమ్మళ్ల కృష్ణ, ఇబ్రహీంపట్నం

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎండలను తట్టుకునేలా దాతల సహకారంతో కొండపైన చలువ పందిళ్లు, తాగునీటి వసతి, ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి ఆలయం వరకు లైటింగ్, మైక్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. స్వామివారి కల్యాణం రోజు రాత్రి వేళ భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం.

- మురళీకృష్ణ, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

వరి కోతల్లో జాగ్రత్తలు తప్పనిసరి

సరైన సమయంలోనే పనులు చేపట్టాలి ● మేలైన పద్ధతులు పాటిస్తేనే ధాన్యం సురక్షితం

మేడ్చల్ ప్రతినిధి, మే 6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వరి కోతలు జోరందుకున్నాయి. అయితే పంట చేతికొచ్చినప్పటి నుంచి కోతలు, తర్వాత ధాన్యం నిల్వ చేయడం విషయాల్లో రైతులు అవగాహన పెంచుకోవాలి. కోతల సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కోతకు 15 రోజుల ముందే నీటి తడి నిలిపివేయాలి. చివరి గింజ తయారయ్యే వరకూ వరి కోయరాదు. లేదంటే తాలు వచ్చే ఆస్కారం ఉంది. ఇలే చేస్తే వడ్ల నాణ్యత తగ్గి మంచి ధర రాదు. అలాగే మంచు ఉన్న సమయంలో కోస్తే గింజలు మెత్తబడి నల్లగా మారతాయి. అదే సమయంలో వరి కోతలు ఆలస్యమైతే గింజ పగుళ్లు వచ్చి ధాన్యం నూక అవుతుంది. 80 నుంచి 90 శాతం వరి వెన్నులు పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంట కోయాలి. పంట పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచకూడదు. అలా చేస్తే వడ్లు నేల రాలుతాయి. ధాన్యంలో పొల్లు ఎక్కువగా చేరుతుంది. సరైన సమయంలో కోస్తే ధాన్యంలో సాధారణంగా 18-20శాతం తేమ ఉంటుంది. గింజలో తేమ శాతాన్ని తగ్గించేందుకు రెండుమూడు రోజులు మెదలు ఎండనివ్వాలి. హార్వెస్టర్‌తో కోస్తే తేమశాతం తగ్గే వరకు వడ్లు ఎండబోయాలి. ఒక వేళ వర్షం వచ్చి పంట తడిస్తే నీటిలో 5శాతం ఉప్పును కలిపి వరిపై పిచికారి చేయాలి. హార్వెస్టర్లతో కోత, నూర్పిడి చేస్తే దుమ్ముధూళి మట్టి పెల్లల కలువకుండా చూసుకోవాలి. కోతల తర్వాత వడ్లను తూర్పారబట్టి చెత్త, మట్టిని వేరుచేయాలి. తూర్పారబట్టిన ధాన్యంలో తేమ 14 నుంచి 12 శాతానికి తగ్గే వరకు ఎండబోయాలి. ఇలా చేస్తే ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. అలాగే మంచి రంగుతో చూడగానే ఆకట్టుకునేలా ఉంటుంది. చవుడు నేలలో పండిప ధాన్యాన్ని ఎర్ర నేలలు, రేగడి నేలల్లో పండిన పంటతో కలపకూడదు. చీడపీడలు ఆశించినా రంగుమారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యంలో కలుపు మొక్కల(వొడిపిలి) గింజలు లేకుండా చూడాలి. ధాన్యం నిల్వ చేసేటప్పుడు అధిక తేమ లేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణ కోసం పరిసరాల్లో పొగబెట్టడం మంచిది. శుభ్రమైన గోనె సంచుల్లో లేదా గుమ్మిలు, కాగుల్లో నిల్వ చేయాలి. ఎలుకలు, సూక్ష్మ జీవులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యం నిల్వ చేసే ప్రదేశం తడి లేకుండా, బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి. ఆరుగాలం కష్టపడి పండించి ధాన్యం చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా పాడైపోతే నష్టం వాటిల్లుతుంది. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ధాన్యం పాడవకుండా ఉంటుంది.



వరి కోస్తున్న హార్వెస్టర్

మడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మడుల్లో ధాన్యం గింజలు పడకుండా చూసుకోవాలి. లేకుంటే తర్వాత పంట సమయంలో ఈ గింజలు మొలిచి పంట కల్తీ అవుతుంది. వరి పొలంలో కంకులు మొత్తం ఎండే వరకు ఆగాలి. పొలం కోసిన తర్వాత కలుపు, ఇతర మొక్కలు ఉంటే తీసివేయాలి. ఇలా చేస్తే వచ్చే పంటలో కలుపు మొక్కల శాతాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.

అధికారుల సూచనలు పాటించాలి



రైతులు వరి కోతల సమయంలో వ్యవసాయాధికారులు చేసే సూచనలు తప్పక పాటించాలి. చిన్నపాటి జాగ్రత్తలతో ఎంతో మేలు జరుగుతుంది. ధాన్యంతో పాటు పొలం మడులపై కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. కోతలు పూర్తయిన తర్వాత ధాన్యాన్ని ప్రభుత్వ కొనగోలు కేంద్రాలకే తరలించాలి. ప్రైవేట్ వ్యాపారులకు వడ్లు అమ్మి రైతులు మోసపోవద్దు.

- చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి



ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న యంత్రం

సబితకు భారీ ఉపశమనం

(ఐదో పేజీ తరువాయి)

కేసు నమోదు చేసిన సీబీఐ 2014 ఏప్రిల్‌లో సబితారెడ్డిని నిందితురాలిగా చేర్చుతూ కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసింది. అప్పటి నుంచి ఆమె రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే ఉన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్‌లో అధికారంలో ఉన్నప్పటికీ ఆమె ఈ వివాదం నుంచి బయటపడలేకపోయారు. చివరకు 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కూడా నిరాకరించింది. అయితే అప్పట్లో ఆమెకు ఉమ్మడి జిల్లాలో పట్టుఉండడంతో ఆమె స్థానంలో కుమారుడు కార్తీక్‌రెడ్డికి చివరి క్షణంలో చేవెళ్ల పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కార్తీక్‌రెడ్డి ఓటమి చెందడంతో ఆమెకు రాజకీయంగా దెబ్బతగిలింది.

తీర్పు పట్ల ఆనందం

ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో సబితారెడ్డికి కాంగ్రెస్ మహేశ్వరం టిక్కెట్ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన ఆమె తర్వాత కాలంలో అప్పటి అధికార బీఆర్ఎస్‌లో చేరి మంత్రివర్గంలో స్థానం కూడా పొందారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాగా, కోర్టు తీర్పుపట్ల సబితారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసు వల్ల రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎన్నో అవమానాలు పడాల్సివచ్చిందని కోర్టు తీర్పుతో న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం పెరిగిందన్నారు.

అభిమానుల సంబరాలు

సీబీఐ కోర్టు సబితారెడ్డిని నిర్దోషిగా ప్రకటించడంతో సబితారెడ్డి అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఉమ్మడి జిల్లాలో సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని సబితారెడ్డి ఇంటి వద్ద, మీర్‌పేటలోని పార్టీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలో సబితారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారమే రైతులకు పరిహారం



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిభట్ల, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌ఆర్ చట్ట ప్రకారమే రైతులకు పరిహారం చెల్లించి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపడుతామని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆదిభట్ల మున్సిపల్ పరిధి కొంగరకలాన్‌లో భూసేకరణ స్పెషల్ అధికారి రాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభకు హాజరైన అదనపు కలెక్టర్ నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో భూమి కోల్పోతున్న కోశిక కోటయ్య, మల్లయ్య తదితర రైతులు అధికారికి సమస్యలను విన్నవించుకున్నారు. గత ప్రభుత్వంలో కొంగర కలాన్‌లోని సర్వే నంబరు 300 కేన్స్ కంపెనీకి భూసేకరణ చేసినప్పుడు 8ఎకరాలు పోగా కానీ ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం కోసం ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ప్రతిమాసింగ్‌కు తెలిపారు. ఇప్పుడు సర్వే నంబర్ 289, 290, 291, 298లలో తమకున్న ఉన్న 5ఎకరాల్లో రోడ్డుకు 2ఎకరాల 10గుంటలు పోతుందని వివరించారు. అధికారులు రోడ్డు సర్వే సరిగా చేయడం లేదని, భూస్వాముల భూములు గుంటల్లో పోతే తమది మాత్రం ఎకరాల్లో పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి పట్టా భూముల్లో నుంచి కాకుండా ప్రభుత్వ భూముల్లోంచి రోడ్డు వేయాలని కోరారు. సాగు భూమిలో హద్దురాళ్లు పెట్టడం సరికాదని అన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ ...

ప్రజాభిప్రాయం మేరకే గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూమిని సేకరిస్తామని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ రాజు తెలిపారు. నిర్వాసిత రైతుల, కుటుంబాల పూర్తి సమాచారం సేకరించామన్నారు. కొంగరకలాన్, ఫీరోజ్‌గూడ పరిధిలో 42మంది రైతుల నుంచి 55ఎకరాల 7గుంటల భూమి సేకరిస్తామన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు మూడు రెట్లు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. నిర్వాసిత కుటుంబంలో 18ఏళ్లు నిండిన ప్రతీ వ్యక్తికి రూ.5లక్షల చొప్పున పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన వసతులన్నీ కల్పిస్తామన్నారు. రైతులు ఆందోళన చెందకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు విజయ్‌కుమార్, తారకేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీపంట్నం డీటీ శ్రీనివాస్, ఆర్ఐ పుష్పలత, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృత్యంలో విద్యార్థినికి ద్వితీయ బహుమతి

కీసర రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): డార్జిలింగ్‌లో నిర్వహించిన ఎనిమిదో జాతీయ స్థాయి నృత్య, సంగీత చాంపియన్‌షిప్-2025 పోటీల్లో నాగారం మున్సిపాలిటీ సెరినిటీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జాహ్నవి ద్వితీయ బహుమతి సాధించింది. మంగళవారం ఆమె ఇంటికి చేరుకోగా కరెస్పాండెంట్ నేముల జంగిరెడ్డి బాలికను సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న జంగిరెడ్డి

అక్రమంగా ధాన్యం తరలించకుండా తనిఖీలు

కొడంగల్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి తెలంగాణ సరిహద్దు కస్తూర్ పల్లి మీదుగా కొడంగల్ ప్రాంతానికి అక్రమంగా వరి ధాన్యాన్ని తరలించకుండా రావుల్‌పల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఏఈవో హెరాల్డ్ ఆధ్వర్యంలో ధాన్యం లోడ్ వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర, సన్నవడ్లకు బోనస్ పొందేందుకు కర్ణాటక రైతులకు అక్రమంగా ధాన్యాన్ని తరలించకుండా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది శంకర్, శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది హనుమంతు, అంజిలప్ప పాల్గొన్నారు.




రావుల్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ధాన్యం వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలి

కొడంగల్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగుచేసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ అన్నారు. పర్సాపూర్ రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎరువుల వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రసాయన ఎరువులు ఎక్కువ వాడితే నేల సహజత్వాన్ని కోల్పోతుందని చెప్పారు. కార్యక్రమంలో తాండూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి, కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ప్యాక్స్ చైర్మన్ కె.శివకుమార్‌గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, ఏవో తులసి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మణ్



పార్టీ అధ్యక్షురాళ్లతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పరిగి, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగిలోని తన నివాసంలో మంగళవారం కొత్తగా కాంగ్రెస్ పార్టీ పరిగి బ్లాక్-1 అధ్యక్షురాలిగా సురేఖారెడ్డి, మండల అధ్యక్షురాలిగా బి.రజితారెడ్డి, పట్టణ అధ్యక్షురాలిగా రజితారెడ్డిలను నియమించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పార్థసారథి, నాయకులు అంజనేయులు, చిన్ననర్సింహులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ ర్యాంకర్‌కు సన్మానం

ఇంటర్ ఫలితాల్లో స్టేట్ మూడో ర్యాంకు సాధించిన విద్యార్థినిని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. పరిగికి చెందిన బోయిని సాయితన్మయి ఇంటర్ సెకండియర్‌లో 994 మార్కులు సాధించింది. బాలికను ఎమ్మెల్యే అభినందించారు.

అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కందుకూరు:రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఎండీవో సరిత కోరారు. బ్యాకుల మేనేజర్లు, వెల్ఫేర్ కార్పొరేషన్ల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో బీసీలు 1,064 మంది, ఈబీసీలు 40, ఎంబీసీలు 7, ఎస్సీలు 671, ఎస్టీలు 220, మైనార్టీలు 105, ఇతరులు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ బాగున్న వారి జాబితాలను మండల పరిషత్‌లో అందజేయాలన్నారు. ఎంపీవో గీత, ఏపీఎం కవిత, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

అకాలవర్షం.. ఆగమాగం

(ఐదో పేజీ తరువాయి)

ధాన్యం బస్తాలను సకాలంలో మిల్లులకు తరలించకపోవడంతో కేంద్రంలోనే మగ్గుతున్నాయి. ధాన్యం రవాణాకు లారీలను ఏర్పాటు చేయడం అధికారులు విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. తూకం వేసిన బస్తాలను తరలించి ఉంటే తమ ధాన్యం బస్తాలు తడిసేవి కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

కేవలం 8వేల బస్తాలు మాత్రమే

వర్షం నీటిలో ధాన్యం కిందికి కొట్టుకుపోయింది. ఉదయం రైతులు కాలువల్లో నుంచి ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకున్నారు. ఎదులాబాద్, మాధారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. ధాన్యం సేకరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కేంద్రాల్లోనే రెండు వేల బస్తాలను తూకం వేసి ఉంచారు. ఎదులాబాద్ సెంటర్‌లో 45 మంది హమాలీలు 15 మంది, మాదారంలో 30 మందికి 15 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం 8 వేల బస్తాల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మాయిశ్చర్ తగినంత లేదని మిల్లర్లు కిలోన్నర ధాన్యం తగ్గించి తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన లారీలను అందుబాటులో ఉంచి సిద్ధంగా ఉన్న ధాన్యంను తరలించాలని రైతులు కోరుతున్నారు.

హమాలీల కొరత ఉంది

రెండు సెంటర్‌లలో హమాలీల కొరత ఉంది. ఏటా బీహార్ నుంచి హమాలీలు వస్తారు. కానీ ఈ సీజన్‌లో అడ్వాన్స్‌గా డబ్బులు ఇచ్చినా హమాలీలు రావడం లేదు. రెండు రోజుల్లో కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. అలాగే ధాన్యం కొనుగోళ్ల కూడా త్వరగా పూర్తి చేస్తాం.

- బోజన్నగారి వెంకటరమణారెడ్డి, డీసీఎంఎస్ మేనేజర్

నాలుగు రోజుల నుంచి కేంద్రంలోనే



తూకం వేసి నాలుగు రోజుల నుంచి ధాన్యం కేంద్రంలోనే మగ్గుతోంది. లారీలు లేక ధాన్యం తరలించడం లేదు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిశాయి. అధికారులు తడిసిన ధాన్యాన్ని తీసుకోమనడంతో మళ్లీ ఆరబోయాల్సిన పరిస్థితి. సకాలంలో వాహనాలను ఏర్పాటు చేసి తూకం వేసిన ధాన్యంను మిల్లులకు తరలించాలి.

- మాయ రమేశ్, రైతు మర్రిపల్లిగూడ

చెక్ బౌన్స్ కేసులను రాజీ చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీరామ్

కొడంగల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిఫ్ కోర్టు పరిధిలో గతంలో నమోదైన చెక్‌బౌన్స్ కేసులను రాజీ చేసుకోవాలని న్యాయాధికారి బీ.శ్రీరామ్ సూచించారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జూన్ 9 నుంచి 14వరకు ప్రత్యేక లోక్‌అదాలత్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ.5లక్షల లోపు ఇచ్చిన చెక్కులు బౌన్స్‌అయితే వాటికి గతంలో కేసులు నమోదు అయినట్లు తెలిపారు. చెక్ బౌన్స్ కేసుల విషయంలో రాజీ కుదుర్చుకునేందుకు రుసుము తీసుకోవడం లేదన్నారు. జూన్ 14న జాతీయ లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులను పరిష్కరిస్తామన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

యాలాల, మే 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఎస్‌వో మోహన్ బాబు, డీఎం మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులకు అందుబాటులో గోనె సంచులు ఉంచాలని సూచించారు. తూకంలో రైతులకు అన్యాయం చేయరాదన్నారు. వారి వెంట డీటీలు శ్రీనివాస్ గౌడ్, గణపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ హాజరుతో అయోమయం

- 'ఉపాధి' పనులకు పెరిగిన డిమాండ్
- ఎండలో కూలీల అవస్థలు
- తాగునీటికి తప్పని తిప్పలు
- సమయానికి రాని కూలి



కోట్‌పల్లి: బార్వాద్‌లోని పనిప్రదేశంలో ఆన్‌లైన్ హాజరు తీసుకుంటున్న ఫీల్డ్‌అసిస్టెంట్

కోట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు ఆన్‌లైన్ హాజరుతో అయోమయంలో పడ్డారు. ఎండలు మండుతుండడంతో ఉదయం సమయానికి వెళ్లినా ఆన్‌లైన్ హాజరు ద్వారా పని ప్రదేశంలో హాజరు తీసుకోకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టుపక్కల ఎక్కడ పనిచేసినా హాజరుకు మాత్రం లోకేషన్ దగ్గరికి రావడానికి తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో పని ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్‌యాడ్ కిట్లు, టెంటు, లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉపాధి మేటీలు ఉండడంతో ఫీల్డ్ అసిస్టెంట్లకు పనిభారం తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఆన్‌లైన్ నుంచి అన్ని బాధ్యతలు ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఉండడంతో పెద్ద గ్రామాల్లో ఆన్‌లైన్ హాజరు తీసుకోవడం ఆలస్యమవుతోంది. గతంలాగా మాస్టర్ విధానం ఉంటే బాగుంటుందని కూలీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మిగిలిపోయిన రోజులు ఈ సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు కూలీలకు డబ్బులు రాకపోవడంతో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కూలి పెంపుతో ఉపాధి పనులపై ఆసక్తి

కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంకింద ప్రతి కూలీకి రూ.307 ఇస్తుండటంతో కూలీలు అధిక మొత్తంలో ఉపాధి పనులు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. మండలంలో 6,262జాబ్‌కార్డులు ఉండగా అందులో 12,485మంది కూలీలు ఉన్నారు. నిరంతరం పనిచేసే వారి జాబ్ కార్డుల సంఖ్య 5,843, మొత్తం కూలీల సంఖ్య 11,373. కాగా ఈ 2025 సంవత్సరం ఏప్రిల్ నుంచి ప్రస్తుతం మండలంలో 4,501మంది పనిచేస్తున్నారు.

పాతపద్ధతే బాగుండేది



ఆన్‌లైన్ హాజరుతో ఇబ్బందులకు గురవుతున్నాం. పని ప్రదేశానికి ముందు వచ్చినా అందరూ వచ్చేవరకూ వేచిచూడాల్సి వస్తోంది. పని చేసిన వారంతా హాజరు కోసం ఒకే దగ్గరికివచ్చి ఆన్‌లైన్ హాజరు వేసుకునేసరికి సమయం వృథా అవుతోంది. ఎండలో వేచిచూస్తున్నాం. పాత పద్ధతే బాగుండేది. - కరుణాకర్ బార్వాద్, కూలీ

కూలీలకు ఏర్పాట్లు చేస్తున్నాం

పని ప్రదేశంలో కూలీలకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు కలగవచ్చు. ఎక్కడా ఇబ్బందులు జరగకుండా చూసుకుంటాం. ఎండ తీవ్రత ఉన్నందున కూలీలు తొందరగా వెళ్లిపని పూర్తి చేసుకొని కూలీలను పంపాలని ఫీల్డ్‌అసిస్టెంట్లకు చెప్పాం.

- ఎలీషా, ఏపీవో

9న తూంకుంటలో గ్రామసభ

మేడ్చల్ ప్రతినిధి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి రోడ్డు వెడల్పులో భాగంగా భూములు కోల్పోతున్న వారికి ఈనెల 9వ తేదీన తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉదయం 10గంటలకు గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా భూపరిపాలన అధికారి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌లోని శామీర్‌పేట్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో భాగంగా భూములు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. హకీంపేట్ దేవరయాంజల్, తూంకుంట పరిధిలో భూములు కోల్పోతున్న వారు ఈ గ్రామసభలో తప్పని సరిగా పాల్గొనాలని కోరారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాములుయాదవ్, మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్లూర్ గ్రామానికి చెందిన విశ్వనాథంకు రూ.2.50లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, మారుతి, శివ, నురోద్దీన్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న నాయకులు

తాండూరురూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని తాండూరు మండలంలో చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. మండల పరిధిలోని కరన్‌కోట్ అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం టీచర్ చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు భరత్ కిషోర్‌గౌడ్, టి.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పౌష్టికాహారాన్ని అందజేశారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని నాగారం మున్సిపల్ మాజీ కమిషనర్ కౌకుంట్ల చంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ శాఖ పరిపాలన అధికారి(సీడీఎంఏ)శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు రాక పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా పలు కాలనీల్లో వీధిదీపాలు లేక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని పేర్కొన్నారు. మూడువేల వీధి దీపాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): సాలిండాపూర్ రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బుస్స చంద్రయ్య, రమేశ్, మొగులప్ప, శ్రీను, లక్ష్మణ్, చందు, వెంకటేశ్ పాల్గొన్నారు.

హద్దురాళ్లు విరగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాండూరురూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో వేసిన హద్దురాళ్లను విరగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళా రైతు కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన కె. భీమమ్మకు గోపన్‌పల్లిలోని సర్వేనెంబర్-1/అ2 లో 1.04 ఎకరాల పట్టాభూమి ఉంది. పొలానికి చుట్టూ హద్దు కడ్డీలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే అట్టి భూమి పక్కన ఉన్న కదీర్ హుస్సేన్ అనే వ్యక్తి దౌర్జన్యంగా హద్దు కడ్డీలను తొలగించి విరగొట్టి తన పొలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వాపోయింది. దౌర్జన్యానికి పాల్పడుతున్న కదీర్ హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

దుద్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతీ రైతు తమ భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని దుద్యాల మండల వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూయజమాన్య వివరాలను రైతుఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయడం ద్వారా ఈఫార్మర్ ఐడీని కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌తో దేశంలోని ప్రతీ వ్యక్తికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు 14అంకెలతో విశిష్టసంఖ్యను కేటాయించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు రైతులు ఆధార్, భూ యజమాన్య పాసుపుస్తకం, ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నెంబర్‌తో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి దగ్గర నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆశావర్కర్లను కార్మిక చట్టంలోకి తేవాలి

కోట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లను కార్మిక చట్టంలోకి తీసుకురావాలని ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు కోరారు. ఈనెల 20న సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మె నోటీసును పీహెచ్‌సీలో మంగళవారం డాక్టర్ మేఘనకు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించి, ఆశావర్కర్లను కార్మిక చట్టంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ అపర్ణ, నర్సమ్మ, ఆశావర్కర్లు అమృత, విజయ, యాదలక్ష్మి, ప్రమీల, లక్ష్మి, రత్నమ్మ పాల్గొన్నారు.

మాజీ మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు



ఓబుళాపురం మైన్స్‌కేసులో మాజీ మంత్రి సబితారెడ్డిని కోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో బీఆర్‌ఎస్ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిలు మంగళవారం రాత్రి శ్రీనగర్ కాలనీలోని ఆమె నివాసంలో సబితారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - వికారాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఈవో

మోమిన్‌పేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని డీఈవో రేణుకాదేవి అన్నారు. మండలంలోని ఎన్కతల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులతో కలిసి ప్రశాంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గౌరీ శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ పరిశీలకురాలు రజిని, డీఆర్‌డీవో ఏపీవో రాజు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కొడంగల్, మే 6 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌ఏలను నియమించుకోవాలని సూచించారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

పరిగి, మే 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పొందాలని సత్యసాయిసేవా సమితి కన్వీనర్ నాగరాజు అన్నారు. శ్రీసత్యసాయిసేవా సమితి రంగాపూర్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ ఐదో బ్యాచ్ శిక్షణను పూర్తి చేసుకున్న 55మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆరుగురి పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేశారు. స్కిల్స్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి మాధవీలత, జిల్లా ఇన్‌చార్జి విద్యారాణి, చేవెళ్ల కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పేదలకు సన్నబియ్యం కాంగ్రెస్ ఘనతే

శామీర్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రాష్ట్రంలోని పేదలకు సన్నబియ్యంతో కడుపు నింపుతున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు తుంకి రమేశ్ ప్రశంసించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పక్కదారి పడుతున్న దొడ్డు బియ్యాన్ని ప్రజాప్రభుత్వం అరికడుతూ రేషన్‌షాపుల ద్వారా పకడ్బందీగా సన్నబియ్యాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తోందని తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

శామీర్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో, అల్వాల్‌కు చెందిన మంచాల రవీందర్-రమాదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టగా శామీర్‌పేటకు చెందిన బత్తిని క్రిష్ణ గౌడ్-ఉర్మిళ దంపతులు, వారి కుటుంబ సభ్యులు 50కేజీల బియ్యం అందజేశారు. అదేవిధంగా వంటిమామిడికి చెందిన కరుణాకర్, బొల్లారం బజార్‌కుచెందిన గీతలు కూరగాయలు అందజేశారు.

స్పందన అంతంతే!

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పాటు చేసి ఎల్ఆర్‌ఎస్‌పై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించినా స్పందన ఆశించిన స్థాయిలో రాలేదు. ఎల్ఆర్‌ఎస్ కోసం 2020లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్త వారికి 25 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునేందుకు వచ్చిన దరఖాస్తుల్లో 20 శాతం కూడా ఫీజు చెల్లించేందుకు ముందుకు రాలేదు. జిల్లా వ్యాప్తంగా నాలుగు మునిసిపాలిటీలు, 594 పంచాయతీల పరిధిలో ఎల్ఆర్‌ఎస్‌కు మొత్తం 36,995 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లో 29,199 ఫీజు లెటర్లు జారీ చేయగా, వాటిలో 6,207 దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించారు. వీటిలో 4,157 దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించారు. జిల్లాలో ఎల్ఆర్‌ఎస్ ద్వారా ఫీజు రూపంలో రూ.19.8 కోట్ల ఆదాయం సమకూరింది. దీంట్లో మునిసిపాలిటీల నుంచి రూ.10.22 కోట్లు, గ్రామ పంచాయతీల నుంచి రూ.9.58 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది.



తాండూరు మున్సిపల్ కార్యాలయం

ఫీజు చెల్లించాం.. ప్రొసీడింగ్ ఇవ్వండి!

- నెల రోజులు దాటినా రాని ప్రొసీడింగ్‌లు

తాండూరు: రాయితీ వస్తుంది.. ఎల్ఆర్‌ఎస్ ఫీజు చెల్లించామంటే డబ్బులు కట్టాం.. నెల రోజులు దాటినా ప్రొసీడింగ్ ఇవ్వలేదంటూ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులు వాపోతున్నారు. డబ్బులు చెల్లించినంత మాత్రానా ప్రొసీడింగ్‌లు అప్పుడే రావని.. సైట్ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుందని గట్టిగా అడిగిన దరఖాస్తుదారులకు మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు. ఫీజు చెల్లించక ముందు ఒక రకంగా చెల్లించాక మరో రకంగా అధికారులు వ్యవహరిస్తున్నారని దరఖాస్తుదారులు మండిపడుతున్నారు. తాండూరు మున్సిపాలిటీలో ఎల్ఆర్‌ఎస్‌పై స్పష్టమైన సమాచారం ఇచ్చే అధికారులు, సిబ్బంది లేరని వాపోతున్నారు. మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపించి ఎల్ఆర్‌ఎస్-2020 దరఖాస్తుదారుల రుసుము చెల్లించిన వారికి ప్రొసీడింగ్‌లు అందేలా చొరవ చూపించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ వలసదారులను వెనక్కి పంపించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమ వలసదారులను గుర్తించి వారిని వెనక్కి పంపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు మాదవరెడ్డి, సదానందారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్లనందు, నాయకులు అమరేందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

చౌడాపూర్: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండెయ్య, జిల్లా సీనియర్ నాయకులు మల్లికార్జున్, పురుషోత్తం, రాజశేఖర్, వెంకటేశ్, మాసయ్య, మల్లేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: పాకిస్తాన్‌కు సంబంధించిన వ్యక్తులు ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, మహిపాల్ పాల్గొన్నారు.



దోమ: తహసీల్దార్ నర్సింహులుకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

దోమ: దోమ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ ప్రజలను వెంటనే దేశం విడిచి పెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్యాట అశోక్‌కుమార్, దోమ నర్సింహులు, బోయిని బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా రెవెన్యూ సదస్సులు

- భూసమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

ధారూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా మండలంలోని అంపల్లి, కాచారం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సదస్సుల్లో ఆయా గ్రామాల్లో భూసమస్యలున్న రైతుల నుంచి 24దరఖాస్తులు అందినట్లు ఆర్డీవో వాసుచంద్ర తెలిపారు. అంపల్లి రెవెన్యూ సదస్సులో 14 దరఖాస్తులు రాగా, ఇందులో సర్వే నంబర్లు మిస్సింగ్ 11 దరఖాస్తులు, సక్సెషన్‌కు 1, ఇతర రెండు దరఖాస్తులు అందాయని తహసీల్దార్ సాజిదా బేగం తెలిపారు. కాచారంలో భూవిస్తీర్ణం సవరణకు 3 దరఖాస్తులు, అసైన్‌మెంట్ పట్టాల కోసం 2, సక్సెషన్‌కు 3, ఇతర 2 దరఖాస్తులు అందాయని ఆమె వివరించారు. బుధవారం(నేడు) అల్లాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ విజయేందర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కీసర: యాద్గార్‌పల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ అశోక్

కీసర: భూ భారతి చట్టంలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకున్న కీసర మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. సదస్సు ఏర్పాటు చేసిన రెండవ రోజు మంగళవారం కీసర రెవెన్యూ పరిధిలోని తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి ఈస్ట్, వెస్ట్ గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేశారు. తిమ్మాయిపల్లిలో 34, యాద్గార్‌పల్లిలో 181 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు.



ధారూరు: కాచారంలో రైతు దరఖాస్తును పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

బషీరాబాద్: ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వై.వెంకటేశ్ అన్నారు. మండలంలోని మైల్వార్ గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ నర్సరీని పరిశీలించి మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శి నర్సింహగౌడ్‌కు ఆదేశించారు. గ్రామంలోని మిషన్ భగీరథ పనులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీకి చేరుకుని పలు రకాల రికార్డులను పరిశీలించి పలు అంశాలపై చర్చించారు. అక్కడికి వచ్చిన స్థానికులు సమస్యలపై ప్రత్యేకాధికారికి విన్నవించగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు.